



పెద్దశంకరంపేటలోని గడికోట అమ్మవారి బోనాల ఊరేగింపులో శివసత్తి పూనకం

అమ్మను తలిచి.. బోనం నివేదించి



సదాశివపేట దుర్గమ్మ మహాజాతర ముగింపు ఉత్సవాల్లో మేకపిల్లను గావుపట్టే దశ్యాన్ని చూసేందుకు తరలివచ్చిన భక్తజనం, పచ్చికుండ బోనం ఊరేగింపు

పెద్దశంకరంపేట/సదాశివపేట ఆగస్టు 2 : మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని గడికోట మహంకాళి, దుర్గా మాత అమ్మవారికి శుక్రవారం అంగరంగవైభవంగా బోనాలను సమర్పించారు. ఉదయం అమ్మవారి తొట్టెల చిత్రపటం పూజా సామగ్రిని భాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి గడికోటలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సరస్వతి శిశుమందిర్ నుంచి బోనాలు ఊరేగింపు నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, శివసత్తులు పూనకాలతో పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు నివేదించారు. అంబాదాస్ బోనం అందరినీ ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో గడికోట ఉత్సవ సమితి సభ్యులు సురేందర్‌రెడ్డి, జంగం శ్రీనివాస్, వేణుగోపాల్ గౌడ్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట భక్తజనసంద్రం

సదాశివపేట పట్టణంలో శుక్రవారం నిర్వహించిన దుర్గమ్మ మహాజాతర ముగింపు ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చారు. ఉత్సవాల్లో చివరిగా నిర్వహించే పచ్చికుండ బోనం ఊరేగింపు ఆకట్టుకున్నది. ఆనవాయితీ మేరకు పట్టణంలోని మాజీ కౌన్సిలర్ గడీల కృష్ణగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడీల నరేందర్‌గౌడ్ ఇళ్ల నుంచి గడీల ప్రసాద్‌గౌడ్ పచ్చికుండ బోనాన్ని నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి దుర్గమ్మకు బోనం సమర్పించారు. దుర్గమ్మ పూనకంతో ఊగిపోయిన నదర్‌లింగమయ్య విన్యాసాలను చూసేందుకు భక్తులు ఉత్సాహం కనబరిచారు. అనంతరం దుర్గమ్మ ఆలయం పక్కన నదర్‌లింగమయ్య రంగమొక్కి మేక పిల్లను గావు పట్టాడు. పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో కల్లుపోతు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, నాగరాజు గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, మాజీ కౌన్సిలర్ రాయిపాడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గడికోట అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

అంతా గప్‌చుప్!

ఏసీబీ దాడులతో అప్రమత్తం.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెలవెల



ఏసీబీ దాడుల ఎఫెక్ట్‌తో సంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతగా కనిపించని సందడి

- భయంతో సిబ్బంది గైర్హాజరు.. ఆలస్యంగా వచ్చిన మరికొందరు
- తెల్లవారుజామున 5 గంటల వరకు సోదాలు
- స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, నగదుపై ఏసీబీ విచారణ

కంది, ఆగస్టు 2 : సంగారెడ్డి జిల్లా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారుల తనిఖీ ప్రభావం రెండోరోజైన శుక్రవారం కార్యాలయ కార్యకలాపాలపై పడింది. శుక్రవారం అక్కడ అంతా నిశబ్ద వాతావరణం నెలకొన్నది. ఏసీబీ అధికారులు గురువారం సాయంత్రం 6 గంటలకు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల వరకు జరిగిన ఈ తనిఖీల్లో రూ.లక్ష సీజ్ చేసినట్లు హైదరాబాద్ జోన్ ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి తెలిపారు. అలాగే గురువారం జరిగిన రిజిస్ట్రేషన్లలోని 56 డాక్యుమెంట్లను విచారణ నిమిత్తం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకొని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కార్యాలయానికి రావాలంటేనే సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. మధ్యాహ్నం 12 దాటినా ఒక్క రిజిస్ట్రేషన్ కాకపోవడం గమనార్హం. ఏదో నామమాత్రంగా కొన్ని రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. సిబ్బంది సమయానికి విధులకు రాకపోవడం, కొందరు డాక్యుమెంట్ రైటర్లు తమ దుకాణాలను మూసేసి ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

తెరుచుకోని డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు

ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు, విల్లాలు, ఇండిపెండెంట్ హౌస్‌లు, మ్యారేజ్ సర్టిఫికెట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు తయారు చేస్తూ ఎంతో బిజీగా ఉండే డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు ఏసీబీ దాడుల నేపథ్యంలో గురువారం సాయంత్రం ఆరు గంటలకే మూతపడ్డాయి. శుక్రవారం కూడా తెర్చుకోకపోవటం గమనార్హం. రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లు తయారు చేసేటప్పుడే కార్యాలయ సిబ్బందికి ఇచ్చే ముడుపులు డాక్యుమెంట్ రైటర్‌లు వారి దుకాణాల వద్దనే తీసుకుంటున్నారని కొందరు క్రయ, విక్రయదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రభుత్వ స్థలం, నిషేధిత స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవాలంటే ఒక రేటు, ఆ స్థలాల్లో లోసుగులు ఉంటే ఒక రేటు, తొందరగా పని పూర్తి కావాలంటే ఇంకో రేటు డాక్యుమెంట్ రైటర్‌లే డిసైడ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ అధికారులు కొందరు కీలకమైన డాక్యుమెంటు రైటర్లు, సిబ్బందిపై కూడా నిఘా పెట్టినట్టు తెలిసింది

బోసిపోయిన కార్యాలయం

సంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వెలవెలబోయింది. రోజుకు వందలాది మంది రిజిస్ట్రేషన్‌ల కోసం వచ్చే ఈ కార్యాలయంలో ఏసీబీ దాడులు డాక్యుమెంట్ రైటర్లతో పాటు సిబ్బంది, క్రయ, విక్రయదారుల్లో సైతం గుబులు పుట్టించాయి. క్రయ, విక్రయదారులు ఎక్కువగా రాకపోయేసరికి కార్యాలయం సెలవు దినాన్ని తలపించింది. పదుల సంఖ్యలో కార్లను నిలిపి ఉంచే పార్కింగ్ స్థలం అంతా ఖాళీగా దర్శమిచ్చింది.



కంది శివారులో తెరుచుకోని డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు

సిబ్బందిలో గుబులు


సంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్టార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం 6 గంటలకు ఒక్కసారిగా ఏసీబీ అధికారులు దూసుకొచ్చారు. వచ్చి రావడంతోనే సిబ్బంది అందరి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సిబ్బంది కూర్చునే టేబుళ్ల వద్ద, అల్మారాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ పరిణామంతో సిబ్బందికి ముచ్చెమటలు పట్టాయి. గురువారం రాత్రి 11 గంటల తర్వాత నుంచి శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల వరకు సిబ్బంది వివరాలు ఏసీబీ అధికారులు తీసుకుని వదిలేశారని తెలిసింది. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కొందరు గైర్హాజరు కాగా, మరికొందరు శుక్రవారం మధ్యాహ్నం తరువాతనే విధులకు హాజరయ్యారు.



మధ్యాహ్నమైనా సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయం

ధరణితో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం

- శాసనసభలో ధ్వజమెత్తిన ఎమ్మెల్యే పట్లోళ్ల



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 2: బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తీసుకువచ్చిన ధరిణి పోర్టల్ విధానంతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం అయిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ధ్వజమెత్తారు. రెవెన్యూ శాఖ పనితీరుపై శుక్రవారం ఆయన శాసనసభలో గళమెత్తారు. గతంలో ఆర్వోఆర్ యాక్టుతో రైతులు, భూయజమానులు హక్కులు కోల్పోకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. 1948, 1979, 1980లో ఆర్వోఆర్ చేపట్టి ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. భూప్రక్షాళన పేరిట సమస్యలు, గెట్టు పంచాయతీలు లేకుండా చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చినప్పటికీ, అనేక సమస్యలు తలెత్తాయన్నారు. ధరణిలో కాస్తు కాలం తొలగించడంతో దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్న వారి పేర్లు కాకుండా గతంలో ఉన్న వారి పేర్లు వస్తున్నాయన్నారు. గతంలోనే భూములను అమ్ముకుని అమెరికాలో స్థిర పడ్డవారి పేర్లు ధరణిలో వచ్చాయన్నారు. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చినప్పటికీ, ధరణిలో పాత యజమానుల పేర్లు చూపించాయని సంజీవరెడ్డి ధ్వజమెత్తారు. ఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట మండల కేంద్రంలో 40 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే ధరణి పోర్టల్‌లో మాత్రం అప్పట్లో భూమిని విక్రయించిన వారి పేర్లు చూపించగా, వారు పోలీసుల సహాయంతో లబ్ధిదారులనే ఖాళీ చేయించారని మండిపడ్డారు. పెద్దశంకరంపేటలో రాణి శంకరమ్మకు సంబంధించిన భూములను మూడు తరాల నుంచి పేదలు సాగు చేసుకుంటుంటే, ధరణి పోర్టల్‌లో పాత వారి పేర్లు రావడంతో ఆ భూములను సైతం వారు లాక్కున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఎస్‌ఐల బదిలీలు

మెదక్ అర్బన్, ఆగస్టు 2: మెదక్ జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. టేక్మాల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న బి.మురళీని మెదక్ రూరల్ ఎస్‌ఐగా బదిలీ చేయగా.. నిజాంసాగర్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కె.సుధాకర్‌ను టేక్మాల్ ఎస్‌ఐగా నియమించారు. వెల్దుర్తి ఎస్‌ఐగా పనిచేస్తున్న డి.నవతాను మెదక్‌కు డీఎస్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. నాగిరెడ్డిపేట ఎస్‌ఐ టి.రాజును వెల్దుర్తి ఎస్‌ఐగా, బి.లింగంకు నర్సాపూర్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. మాచారెడ్డి ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌ను పాపన్నపేట ఎస్‌ఐగా బదిలీ చేశారు. జుక్కల్ ఎస్‌ఐ సత్యనారాయణకు హావేళీఘణపూర్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు.

సంగారెడ్డి జిల్లాలో పలువురు

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 2 : సంగారెడ్డి జిల్లాలో పలువురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పటాన్‌చెరు ట్రాఫిక్ ఎస్‌ఐలు పి.జీవరత్నం, ఎం.స్వామిదాస్, సంగారెడ్డి సీసీఎస్ నుంచి మహిపాల్‌రెడ్డి, నారాయణఖేడ్ నుంచి ఎస్.శ్రీనివాస్ వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. వికారాబాద్ జిల్లా నుంచి పలువురు ఎస్‌ఐలను జిల్లాకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఎస్‌ఐలు వెంటనే తమ విధుల్లో చేరాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రై డే

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట, ఆగస్టు 2 : మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రతీ శుక్రవారం అందరూ డ్రైడే పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పాపన్నపేట మండలం గాంధారిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం గ్రామ పరిసరాలను, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలని, ఎక్కువ రోజులు నీటిని నిల్వ చేయరాదని, కొబ్బరిబోండాలు, ప్లాస్టిక్ వస్తువులను ఇళ్ల పరిసరాల్లో ఉంచకూడదని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మెదక్ అర్బన్, ఆగస్టు 2 : జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం, వన



నిల్వ ఉన్న నీటిని పారబోపిస్తున్న కలెక్టర్

మహోత్సవం కార్యక్రమాల అమలు తీరు, చేపట్టాల్సిన వివిధ అంశాలపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు రోజులపాటు జరగనున్న కార్యక్రమంలో రోజువారీగా చేట్టాల్సిన పనులపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో జిల్లా పరిషత్ సీఈవో, డీఆర్డీవో, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి, అందరినీ భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఎఫ్‌వో బోజి, డీఎంహెచ్‌వో డా. శ్రీరామ్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, పీఆర్‌ఈఈ నర్సింలు వివిధశాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఈసీ పేరిట రైతుల నుంచి వసూళ్లు

- రుణమాఫీ వివరాలు చెప్పేందుకు దండుకుంటున్న ప్యాక్స్ సిబ్బంది
- డబ్బు ఇవ్వకపోతే దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతుల ఆవేదన

కౌడిపల్లి, ఆగస్టు 2 : రుణమాఫీ జరగడంతో రైతులు సంతోషంతో మళ్లీ రుణాలు పొందేందుకు సొసైటీ తలుపు తట్టగా వారి నుంచి అందిన కాడికి దండుకుంటున్న వైనం మండల పరిధిలోని మహ్మద్‌నగర్ ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్)లో నెలకొన్నది. మహ్మద్‌నగర్ సహకార సంఘంలో సుమారు 1,189 మంది రుణం పొందిన ఖాతాదారులు ఉండగా 729 మందికి మాఫీ జరిగింది. దీంతో తిరిగి రుణం పొందేందుకు గాను రైతులు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. రుణం కోసం ఈసీ(ఎన్‌కంబరెన్స్ స్టేట్‌మెంట్) అవసరం ఉండటంతో ఇదే అదునుగా భావించిన సిబ్బంది రైతుల నుంచి రూ.ఐదు వందల నుంచి ఆరు వందల వరకు వసూలు చేస్తున్నారు. ఇదేమిటని అడిగితే అడిగినంత ఇస్తేనే రుణమాఫీ వివరాలు ఇస్తామని లేదంటే దురుసుగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే రుణమాఫీ చేయరని భయంతో తప్పనిపరిస్థితిలో చెల్లిస్తున్నామని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఈసీ సహకార సంఘంలోనే ఉచితంగా అందించే



అవకాశం ఉన్నప్పటికీ అవేమి పట్టించుకోకుండా మీ సేవ నిర్వాహకులతో కుమ్మక్కై వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై పీఏసీఎస్ సీఈవో దుర్గాగౌడ్‌ను వివరణ కోరగా ఈసీ ఇక్కడే ఇచ్చే వెసులుబాటు ఉన్నా తమ వద్ద సరిపడా సిబ్బంది లేరని, దీంతో చేసేదేమీ లేక మీసేవ కేంద్రాలకు పంపిస్తున్నామని తెలిపారు.

దారుణంగా ప్రవర్తిస్తున్నారు



రుణమాఫీ వచ్చిందనే సమాచారంతో సహకార సంఘంలోనికి వెళ్లాను. మాఫీ వివరాలు తెలపాలని అధికారులను అడిగితే దురుసుగా ప్రవర్తించారు. ఏమీ తెలియని వారికి చెప్పి లాభం లేదంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు. 70 ఏళ్ల వయస్సులో నాపై ఇంత దారుణంగా ప్రవర్తించడం బాధాకరం.

- కిష్టాగౌడ్ సదాశివపల్లి

కెనాల్ కోసం భూమి పోతుందన్న బెంగ

గుండెపోటుతో రైతు మృతి

- న్యాయం చేయాలని గ్రామస్థుల రాస్తారోకో

నర్సాపూర్, ఆగస్టు 2: కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి రానున్న సంగారెడ్డి కెనాల్ కోసం తమ భూమి పోతుండటంతో కొన్ని రోజులుగా తీవ్ర బెంగతో ఉన్న ఓ రైతు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామానికి చెందిన వంటెల రామ్‌రెడ్డి(61)కు గ్రామ సమీపంలో రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని నమ్ముకుని అతని కుటుంబం జీవిస్తోంది. ఒక కొడుకు, ఒక కూతురు ఉండగా ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. అయితే, రామ్‌రెడ్డికి చెందిన భూమి నుంచి సంగారెడ్డి కెనాల్ కోసం అధికారులు భూసేకరణ చేపట్టారు. భూమి పోతే తన కుటుంబం పరిస్థితి ఏమిటని రామ్‌రెడ్డి కొన్ని రోజులుగా బెంగపెట్టుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు.



రామ్‌రెడ్డి(ఫైల్)



రాస్తారోకో చేస్తున్న రామ్‌రెడ్డి బంధువులు, చిన్నచింతకుంట రైతులు

న్యాయం చేయాలి : గ్రామస్థులు

సంగారెడ్డి కెనాల్ కింద భూమి పోతుందన్న బెంగతో గుండెపోటు వచ్చి చనిపోయిన రామ్‌రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు హైదరాబాద్-మెదక్ రహదారిపై చిన్నచింతకుంట సమీపంలో రాస్తారోకో చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకాగా, ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వచ్చి గ్రామస్థులకు నచ్చజెప్పి.. ఆందోళన విరమింప చేయించారు.

ఐదు రోజులు మోస్తరు నుంచి భారీ వానలు

- ఉమ్మడి మెదక్ జిల్లాకు వర్ష సూచన
- ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసిన వాతావరణశాఖ

మెదక్ అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో రాగల ఐదు రోజుల పాటు ఉరుముల, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. వర్షానికి తోడుగా 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో చల్లనిగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం మెదక్, సిద్దిపేట జిల్లాలో అక్కడక్కడ గాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి జిల్లాకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

మెదక్ జిల్లాలో వర్షం

మెదక్ జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది.



రెండు రోజుల పాటు వర్షానికి విరామం ఇచ్చిన వరుణుడు శుక్రవారం సాయంత్రం పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దాంతో రోడ్లన్నీ వర్షపునీటితో జలమయమయ్యాయి. ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మెదక్ పట్టణంలో 11 కేవీ విద్యుత్ వైరు తెగిపోయింది. దాదాపు గంట పాటు సరఫరా నిలిచిపోయింది. లైన్‌మెన్ మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

'తలసరి'లో నంబర్ వన్

రాష్ట్రం కంటే సంగారెడ్డిలోనే ఎక్కువ.. వెనకబడిన మెదక్, సిద్దిపేట

7లో



సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

చేర్యాల, ఆగస్టు 2: సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ. రమణ కోరారు. సిద్దిపేట జిల్లా గీతన్నల చైతన్యయాత్రలో భాగంగా శుక్రవారం కొమురవెల్లి మండలకేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించి అనంతరం బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం గౌడ, గీతకార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోహెడ కొమురయ్య, కుర్ర ఉప్పలయ్య, జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, నాయకులు బండపల్లి శంకరయ్య, బాల్నె వెంకట మల్లయ్య, అనగోనినర్సింహులు, పోతుగంటి లింగం, ఆకుల కనకయ్య, యాదాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చైతన్య మహాసభలో మాట్లాడుతున్న కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం

● కొమురవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరన్ ఆచార్య


చేర్యాల, ఆగస్టు 2: తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరమని కొమురవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరన్ ఆచార్య అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొమురవెల్లి పీహెచ్‌సీలో సూపర్‌వైజర్ పావణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిపాలు అమృతంలాంటివని, రోగనిరోధకశక్తి కలిగిన తల్లి ముర్రుపాలను పుట్టిన గంటలోగా పట్టించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకరన్ ఆచార్య

'క్రీడలతో మానసిక ఉల్లాసం'

మిరుదొడ్డి, ఆగస్టు 2: క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసం చేకూరుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎర్త్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని 8 పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్రీడపోటీలను నిర్వహించారు.





















» వెనుకబడిన మెదక్, సిద్దిపేట
» ఉమ్మడి జిల్లాలో సగం మందికి ఉపాధి లేదు
» బడికి దూరంగా 40 శాతం పిల్లలు
» ఆర్థిక, సామాజిక నివేదిక-2024లో వెల్లడి

'తలసరి'లో నంబర్ వన్

రాష్ట్రం కంటే సంగారెడ్డిలోనే ఎక్కువ



మెదక్, ఆగస్టు 2: తలసరి ఆదాయంలో సంగారెడ్డి జిల్లా.. రాష్ట్ర సగటు కంటే ముందంజలో ఉంది. సంగారెడ్డితో పోలిస్తే మెదక్, సిద్దిపేట జిల్లాలు వెనుకబడ్డాయి. పారిశ్రామిక రంగంతో పాటు పంటల సాగు, విద్య, వైద్య రంగాల్లోనూ సంగారెడ్డి జిల్లా మెరుగైన స్థానంలో నిలిస్తే.. మిగిలిన రెండు జిల్లాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగం విడుదల చేసిన ఆర్థిక, సామాజిక నివేదిక-2024లో ఈ విషయం వెల్లడైంది. జిల్లాలవారీగా జనాభా, అక్షరాస్యత, విద్య, వైద్య రంగాలు, వస్తు సేవల వినిమయం తదితర అంశాలను క్రోడీకరించి ప్రతీ పౌరుడి తలసరి ఆదాయం (పర్ క్యాపిటా) వివరాలు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలో పౌరుల తలసరి ఆదాయం రాష్ట్ర సగటు కంటే ఎక్కువగా ఉంది. (అన్నిరకాల సేవలు, వస్తువుల ద్వారా వచ్చే ఆదాయాన్ని జిల్లాలోని పౌరులందరికీ విభజిస్తే ఒక్కో పౌరుడికి వచ్చే వాటానే పౌరుల తలసరి ఆదాయంగా లెక్కిస్తారు). రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.3,11,649 ఉండగా.. సంగారెడ్డి జిల్లాలో ఇది రూ.3,22,394గా నమోదైంది. రాష్ట్ర సగటుకంటే జిల్లా మెరుగైన స్థితిలో నిలిచింది. మరో వైపు మెదక్ జిల్లా తలసరి ఆదాయం రూ.2,55,263, సిద్దిపేట జిల్లా తలసరి ఆదాయం రూ.2,35,218గా నివేదికలో పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాలు రాష్ట్ర సగటు కంటే వెనుకబడ్డాయి.

బడికి దూరం..



అక్షరాస్యత విషయంలో సంగారెడ్డి జిల్లా కాస్త మెరుగ్గా ఉంది. జిల్లా జనాభాలో 64.07 శాతం అక్షరాస్యులు ఉన్నట్లు వెల్లడయ్యింది. మిగిలిన 35.03 శాతం పిల్లలు బడికి దూరంగా ఉన్నారు. సిద్దిపేట జిల్లాలో 61.62 శాతం అక్షరాస్యత నమోదవగా.. ఇంకా 38.38 శాతం పిల్లలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. మెదక్ జిల్లాలో 56.12 శాతం పిల్లలు బడికి వెళుతుండగా.. 43.88 శాతం బడి బయటే గడుపుతున్నట్లు తెలుస్తోంది.

లింగ నిష్పత్తి

ఉమ్మడి జిల్లాలో పెద్దవారితో పోలిస్తే ఆరేళ్ల లోపు చిన్నారుల్లో లింగ నిష్పత్తి తక్కువగా ఉంది. ప్రతీ వెయ్యి మంది బాలురకు సంగారెడ్డి జిల్లాలో సగటున 955 మంది బాలికలు ఉన్నారు. మెదక్ జిల్లాలో సగటున 946 మంది బాలికలే ఉన్నట్లు నివేదికలో వెల్లడైంది. సిద్దిపేట జిల్లాలోనూ వెయ్యికి 952 మంది బాలికలు ఉన్నారు. లింగ నిష్పత్తిలోనూ సంగారెడ్డి జిల్లా మెరుగైన స్థానంలో నిలిచింది.

పనిచేసేవారూ తక్కువే

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 50 శాతం పనికి దూరంగా ఉంటున్నట్లు ఆర్థిక, సమామాజిక నివేదిక పేర్కొంది. సంగారెడ్డి జిల్లాలో పనిచేసేవారి సంఖ్య తక్కువగా ఉన్నది. జిల్లా జనాభా 15,28,903 మంది ఉండగా.. ఇందులో 6,88,760 మంది మాత్రమే వివిధ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అంటే 45.05 శాతం మందికి మాత్రమే పనుల ద్వారా ఉపాధి లభిస్తోంది. మెదక్ జిల్లా జనాభా 7,66,153 మంది ఉండగా పనుల్లో ఉన్నవారు 3,85,206 మందికి (50.28 శాతం) పని లభిస్తున్నది. సిద్దిపేట జిల్లా జనాభా 10,12,065 మంది కాగా.. వివిధ పనుల్లో ఉన్నవారు 5,09,503 మంది (50.35 శాతం) ఉన్నారు. సగటున ఉమ్మడి మెదక్ జిల్లాలో 50 శాతం మంది పనికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.



పరిశ్రమలకు ప్రోత్సాహమిస్తే..

ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఉమ్మడి జిల్లాలో సంగారెడ్డి జిల్లా పరిధిలోనే 26,299 పరిశ్రమలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 23,419, మెదక్ జిల్లాలో 15,318 పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమలు మరింత విస్తరిస్తే జిల్లావాసులకు ఉపాధి దొరుకుతుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అపారమైన వనరులున్నాయి. పంటల సాగు, పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులున్నాయి. పరిశ్రమలను ప్రోత్సహించడంతోపాటు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి పంటలకు నీరందిస్తే రైతులు ఆర్థికంగా ఎదగడం ద్వారా ఆశించిన అభివృద్ధి సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

పేకాట స్థావరంపై దాడి.. 9 మంది అరెస్ట్

రూ.67,920 నగదు స్వాధీనం
మూడు కార్లు సహా 10 మొబైళ్లు, 4 మోటార్ సైకిళ్లు కూడా..

ములుగు, ఆగస్టు 2: పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ. 67,920 నగదును స్వాధీనం చేసుకున్నారు. ములుగు మండలం క్షీరాసాగర్ గ్రామంలోని ఓ ఫామ్‌హౌస్‌లో గురువారం రాత్రి పేకాట శిబిరం నడుస్తోందని వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ విజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితుల నుంచి నగదుతో పాటు 10 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పేకాట ఆడిన వారిలో అందరూ హైదరాబాద్ ప్రాంతం వారే ఉన్నారు. మామిడి మహేందర్‌రెడ్డి(బోయిన్‌పల్లి), కొండం రాజేంద్రప్రసాద్(బషీర్‌బాగ్), కాశిపాక నారాయణ(నాంపల్లి), చిత్తారు సురేష్‌కుమార్(కూకట్‌పల్లి), బత్తుల శివదుర్గప్రసాద్(కాప్రా ఈసీఎల్), నెల్లెపాల నరేష్(వనస్థలిపురం), పింక రాజేందర్(దమ్మాయిగూడ), మునుగుల వినయ్(బోయిన్‌పల్లి), పెండల యాదగిరి(బోయిన్‌పల్లి) ఉన్నారు. ఈ పేకాట స్థావరం క్షీరాసాగర్‌కి చెందిన బొడ్డు నర్సింలు, బోయిన్‌పల్లికి చెందిన గడ్డం ప్రవీన్‌యాదవ్‌లు నిర్వహిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తెలిసింది.



పోలీసుల అదుపులో ఉన్న కారు

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నారాయణఖేడ్, ఆగస్టు 2: పట్టపగలు చోరీ చేసిన కేసులో నారాయణఖేడ్ పోలీసులు నిందితుడిని మూడు రోజుల్లో పట్టుకుని, సొత్తును రికవరీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఖేడ్ ఎస్ఐ విద్యాచరణరెడ్డి శుక్రవారం మీడియాకు వివరించారు. తుర్కపల్లికి చెందిన కుర్మ అంజుగొండ గత నెల 30న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనుల కోసం వెళ్లారు.గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ప్రవేశించి బీరువా తాళాలు పగులగొట్టి బంగారు, వెండి నగలను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నారాయణఖేడ్ పోలీసులు విచారణలో భాగంగా మన్సూర్‌పూర్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా తుర్కపల్లికి చెందిన గోవింద్‌మాణిక్యం పోలీసులను చూసి ఆటో దిగి పారిపోబోయాడు. దీంతో అతడిని వెంబడించి పట్టుకున్నారు. విచారించగా, అంజుగొండ ఇంట్లో దొంగతనం తానే చేసినట్లు అంగీకరించాడన్నారు. నిందితుడి నుంచి 26 గ్రాముల బంగారు నగలు, 31.0 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గత సంవత్సరం అక్టోబరులో పట్టణంలోని ముతూట్ ఫైనాన్స్‌లో చోరీకి యత్నించిన కేసులోనూ నిందితుడని తెలిపారు. మద్యానికి బానిసై జూదం, జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలకు పాల్పడ్డాడని వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

కస్తూర్బాగాంధీ విద్యార్థినికి అస్వస్థత

మెదక్ అర్బన్, ఆగస్టు 2: మెదక్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని మానస మూడు రోజుల కింద అస్వస్తతకు గురైంది. దగ్గు, జలుబుతో బాధపడుతున్న మానసకు స్కూల్‌లోనే ప్రాథమిక చికిత్స చేశారు. గత నెల 31న విద్యార్థినిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. వెంటనే వారు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ దగ్గు తీవ్రంగా వస్తుండడంతో అన్ని వైద్య పరీక్షలు చేయగా నార్మల్ వచ్చిందని ఆసుప్రతి వర్గాలు పేర్కొన్నాయి. అగకుండా నిరంతరంగా దగ్గు రావడంతో విద్యాలయ ప్రిన్సిపల్ కవిత విద్యార్థిని పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లారు. అధికారుల సహకారంతో మెరుగైన చికిత్స కోసం మానసను నిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తీసుకొచ్చిన దగ్గు మందు మాత్రమే మానసకు వేశామని, మరోసటి రోజు మధ్యాహ్నం వారి తల్లిదండ్రులకు మానసను అప్పగించామన్నారు. కస్తూర్బాలో ఇచ్చిన దగ్గు మందు వల్ల తన కూతురు అస్వస్థతకు గురైందని విద్యార్థిని తండ్రి స్వామి ఆరోపించారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళన



రాయదుర్గం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ బంధువు మృతి చెందాడని గచ్చిబౌలిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట శుక్రవారం ఆందోళన చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన వెంకటేష్(45) అనారోగ్యంతో 10 రోజుల క్రితం ఆసుపత్రిలో చేరాడు. శుక్రవారం ఉదయం కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయాడు. దీంతో మృతుడి బంధువులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మరణించాడని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతరెడ్డి ఆసుపత్రికి చేరుకొని బంధువులను పరామర్శించారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి బంధువుల అనుమానాలను నివృత్తి చేశారు.

పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య



మహేశ్వరి (ఫైల్)

చేర్యాల, ఆగస్టు 2: చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన పుప్పాల మహేశ్వరి (24) శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుప్పాల వెంకటేశ్వర్లు, పద్మల కుమార్తె మహేశ్వరి ఎంసీఏ పూర్తి చేసి, ఇటీవల ఉద్యోగం సైతం సాధించింది. ఆమెకు కొద్ది రోజుల క్రితం యాదాద్రి-భువనగిరి జిల్లా ఆలేరు మండలం ఓ గ్రామానికి చెందిన కానిస్టేబుల్‌తో వివాహం నిశ్చయం జరిగింది. ఆమె వివాహం ఘనంగా చేయాలని తల్లిదండ్రులు ఏర్పాటు చేసుకుంటున్న క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన ఇరుగు, పొరుగు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికిత తీసుకువస్తుండగా, మార్గమధ్యంలోనే మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీజే నిర్వాహకుల నిర్లక్ష్యం
బాలుడికి విద్యుత్ షాక్

శివ్వంపేట, ఆగస్టు 2: బోనాల పండుగలో భాగంగా శుక్రవారం నిర్వహించిన తొట్టెల ఊరేగింపులో ఓ బాలుడికి కరెంట్ షాక్‌తో స్వల్ప గాయాలు అయ్యాయి. డీజే నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే బాలుడికి కరెంట్ షాక్ తగిలినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామంలో పోచమ్మ బోనాలలో భాగంగా గురువారం రాత్రి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాలీ ఆటోలో డీజే సౌండ్ బాక్స్ ఏర్పాటు చేయగా, దాని వైర్ తేలి ఉంది. గమనించిన బాలుడు ఆటోను పట్టుకోగా, కరెంట్ షాక్ తగిలింది. బాలుడు స్పృహ తప్పి పడిపోగా, స్థానికులు సీపీఆర్ చేసి స్పృహలోకి రప్పించారు. అయితే, బాలుడి చేతికి మాత్రం స్వల్ప గాయమైంది.

30 ద్విచక్ర వాహనాలు సీజ్

నర్సాపూర్, ఆగస్టు 2: నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న 30 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేసినట్లు సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టి లైసెన్సు, నెంబరు, సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపేవారు ఎంతటివారైనా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. వాహనం నడిపేవారు 18 ఏళ్లు నిండి, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సమర్థవంతంగా నూతన చట్టాల అమలు : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 2: నూతన చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. నూతన చట్టాల అమలు తీరుపై జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు నూతన చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నూతన చట్టాలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను సైతం స్వీకరించి, ముందస్తు విచారణ జరపాలన్నారు. ప్రతి కేసులో నేరస్తుల ఫొటోలు, వీడియోలు రికార్డు చేయాలన్నారు. కొత్త చటట్టాల అమలులో మంచి పనితీరు కనబర్చిన అధికారులకు రివార్డులు ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ



వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

వెల్దుర్తి, ఆగస్టు 2: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను స్థానిక ఎస్ఐ నవత గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రత్యేక సిబ్బందిని నియమించి రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణ, రాత్రి వేళ పెట్రోలింగ్, డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఎస్పీ వివరించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, బాధితుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, సిబ్బంది ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న మెదక్ వైద్యాధికారి శ్రీరామ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

వెల్దుర్తి, ఆగస్టు 2: సీజన్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. ఫ్రైడే డ్రైడే పురస్కరించుకుని శుక్రవారం ఆయన వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రిజిస్టర్లను పరిశీలించి, స్థానిక వైద్యురాలు సౌజన్యను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

ట్రిబుల్ ఆర్ సర్వే పూర్తి: ఆర్డీవో



సర్వే చేస్తున్న ప్రత్యేక అధికారుల బృందం

నర్సాపూర్, ఆగస్టు 2: ట్రిబుల్ ఆర్ భూసేకరణ కోసం సర్వే పూర్తయినట్లు నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లో ట్రిబుల్ ఆర్ కోసం 17 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉండగా, 13 గ్రామాల్లో సర్వే పూర్తి అయినట్లు వివరించారు. నాలుగు గ్రామాల్లో సర్వేకు వివిధ కారణాలతో రైతులు అడ్డుకుంటున్నారని, విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.

ఆయిల్ బాల్స్‌తో దోమలకు చెక్



పాత ఇంజన్ ఆయిల్, వస్త్ర పీలికలతో తయారీ
నీటి గుంతల్లో, పిచ్చి మొక్కలు, తడి ఉన్నచోట ఏర్పాటు
ఖర్చు తక్కువ... ఫలితం ఎక్కువ
కంది మండలంలో ప్రయోగాత్మకం

కంది, ఆగస్టు 2: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంతో దోమలను నివారించేందుకు అధికారులు కంది మండలంలో కొత్త ప్రయోగం చేస్తున్నారు. దోమలను అరికట్టేందుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ పలితాలను ఇచ్చే ఆయిల్‌బాల్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. రోడ్లపైన పడేసిన వస్త్ర పీలికలను, వాహనాల్లో ఉపయోగించి వదిలేసిన పాత ఇంజన్ ఆయిల్‌ను ఉపయోగించి ఆయిల్ బాల్స్‌ను తయారు చేస్తున్నారు. పాత ఇంజన్ ఆయిల్‌లో ఉంచిన వస్త్ర పీలికలను బాల్ లాగా గుండ్రంగా చుట్టి నీటి కుంటల్లో, మురుగునీరు నిలిచే చోట వేస్తే దోమలు చనిపోతాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాక ఈ ఆయిల్‌బాల్స్ ఉపయోగించడంతో దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే అంతరిస్తాయని నిపుణులు సైతం చెబుతున్నారు. అయిల్ బాల్స్ ఉపయోగించడం ద్వారా చిన్న చిన్న వైరస్‌లు, క్రిమికీటకాలు కూడా మరణిస్తాయని అంచనా వేస్తున్నారు. కంది మండలంలో ఈ ఆయిల్ బాల్స్‌ను తొలిసారిగా ఎర్దనూర్, వడ్డెనగూడ తండాతో పాటు వివిధ గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద సిబ్బందితో తయారు చేయించి ప్రయోగాత్మకంగా ఉపయోగించారు. ఇదివరకు గ్రామాల్లో మురుగు కాలువల పైన బ్లీచింగ్ పౌడర్ చల్లడం, వీధుల్లో ఫాగింగ్ చేస్తూ దోమలను అరికట్టేవారు. అయినా గాని ఒకటి రెండు రోజుల్లోనే దోమలు మళ్లీ వృద్ధి చెంది ప్రజలకు డెంగ్యూ మలేరియా తదితర జ్వరాల బారిన పడేసేవి. ఇక ఇప్పుడు ఈ ఆయిల్స్‌బాల్స్ ప్రయోగం ఎంతవరకు ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి మరి.





ఆయిల్‌బాల్స్ తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దోమలు ఉండవు

పాత ఇంజన్ ఆయిల్‌తో తయారుచేసిన అయిల్ బాల్స్ ఉన్నచోట దోమలు వృద్ధి చెందవు. తడి ఉన్న ప్రదేశాల్లో కుంటల్లో ఈ ఆయిల్ బాల్స్‌ను వేస్తే దోమలలోని లార్వా కూడా మరణించి దోమలను పూర్తి స్థాయిగా అరికట్టవచ్చు. కంది మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా పరిశీలించాం. ప్రజలు దోమ కాటుకు గురై విషజ్వరాల బారిన పడకుండా ఉండేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాస్, కంది ఎంపీడీవో

30 ఏళ్ల పోరాటానికి తెరపడింది

- మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ
- సుప్రీంకోర్టు తీర్పుపై సంబురాలు

జహీరాబాద్, ఆగస్టు 2: ఎమ్మార్పీఎస్ అధినేత మందక్రిష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న పోరాటానికి తగిన ఫలితం లభించిందని మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుగుణంగా ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైందన్నారు. ఎమ్మార్పీఎస్ అధినేత ఆధ్వర్యంలో జరిగిన పోరాటాల చేశామని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ పట్టణంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ర్యాలీలను నిర్వహించి స్వీట్లను పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగా అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నరోత్తం, నాయకులు మల్లికార్జున్‌పాటిల్, అప్పం శ్రవణ్, ఉల్లాస్‌మాదిగ, విశ్వనాథ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

●**పుల్‌కల్**: ఎస్సీ, ఎస్టీ ఉప కులాలను కేటగిరీలుగా విభజించొచ్చని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడాన్ని స్వాగతిస్తున్నామని దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్లె సంజీవయ్య తెలిపారు. శుక్రవారం నాడిక్కడ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 30 ఏళ్ల సుదీర్ఘ కాల పోరాటానికి దక్కిన ఫలితమిదని, ఇది చరిత్రాత్మకమైన తీర్పు అని సంతోషం వ్యక్తం చేశారు.

●**జిన్నారం**: ఎస్సీ వర్గకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలపడంతో జిన్నారంలో మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగు రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్, భాస్కర్, జానాభాయి తదతరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అబ్రహంమాదిగ, తదితరులు

●**నారాయణఖేడ్**: నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహం ఆవరణలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్‌షెట్కార్, ఖేడ్, జుక్కల్ ఎమ్మెల్యేలు పట్లోళ్ల సంజీవరెడ్డి, లక్ష్మీకాంతారావు చిత్రపటాలతో కూడిన ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. సీఎంకు నియోజకవర్గ వాసుల తరఫున డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు జైరాజ్, కృష్ణ, అమృత్, శ్రీకాంత్, సాయిలు, స్వామిదాస్, అర్జున్ పాల్గొన్నారు.



శివ్వంపేటలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మెదక్ జిల్లాలో

●శివ్వంపేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును స్వాగతిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెట్లపల్లి యాదగిరి ఆధ్వర్యంలో సంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారిపై మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎల్లేష్, సీనియర్ నాయకులు నరాల లక్ష్మణ్, బీజేపీ నాయకులు ఉన్నారు.

●**వెల్దుర్తి**: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాదగిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తి అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులుశేఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం



శ్రీలత(ఫైల్), శివప్రసాద్(ఫైల్)

టేక్మాల్, ఆగస్టు 2: ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన టేక్మాల్ మండలంలోని ఎల్లుపేట గ్రామంలో చోటు చేసుకుంది. టేక్మాల్ ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముడ రాములు, అనితకు కుమార్తె శ్రీలత(19), శివప్రసాద్(12) ఉన్నారు. వీరి తల్లి 10 ఏళ్ల క్రితం, తండ్రి ఐదునెలల క్రితం మృతిచెందారు. పిల్లలిద్దరూ పెద్దనాన్న నర్సింహులు వద్ద ఉంటూ చదువుకుంటున్నారు. గురువారం కుటుంబీకులు పొలం వద్దకెళ్లారు. తిరిగి వచ్చి చూసేసరికి ఇద్దరూ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పెద్దనాన్న టేక్మాల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

శివ్వంపేట, ఆగస్టు 2: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన తూప్రాన్- సంగారెడ్డి జాతీయ రహదారి మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నానుతండాకు చెందిన రాందాస్(27) నర్సాపూర్ నుంచి తూప్రాన్ వైపు వస్తున్న లారీకి శివ్వంపేట వెజిటేబుల్ మార్కెట్ ఎదుట రాందాస్ ఎదురుగా వచ్చాడు. దీంతో ఎడమకాలి పైనుంచి లారీ టైర్ పోవడంతో నుజ్జునుజ్జయింది. రాందాస్ గంజాయి సేవించి ఉండొచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఉచిత హెల్త్ క్యాంపునకు స్పందన



ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు

సంగారెడ్డి అర్బన్/హత్నూర, ఆగస్టు 2: సంగారెడ్డిలోని సాహితీ ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపునకు స్పందన లభించింది. న్యూరాజిస్ట్ డా.పవన్‌కుమార్, ఆర్తో డా.అబ్దుల్ రావూఫ్, జనరల్ ఫిజిషియన్ డా.శ్రీనివాస్‌లు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి సేవలందించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన హెల్త్ క్యాంపు సుమారు 500 మంది వ్యాధిగ్రస్తులు వైద్య సేవలు పొందారు. షుగర్, బీపీ, ఆర్తో, నరాల సమస్యలున్న వారు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రతి శుక్రవారం ఉచిత న్యూరో వైద్య పరీక్షలు చేస్తామని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సాహితీరాము తెలిపారు. హత్నూర మండలం కోడిప్యాక గ్రామంలో సంగారెడ్డి వెల్నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించినట్లు ఆస్పత్రి ప్రతినిధులు శివరామకృష్ణ తెలిపారు. సుమారు 100 మంది ప్రజలు ఈసీజీ, షుగర్, బీపీ, తదితర వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ పర్యటన

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో శుక్రవారం తెల్లవారు జామున నుంచి మూడు గంటల పాటు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్ వివేకానంద్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ పర్యటించారు. రాయిపల్లి రోడ్డులో జాతీయ రహదారి పక్క నుంచి మురుగునీరు ప్రవహిస్తుండటాన్ని చూశారు. పక్కన ఉన్న పశువుల షెడ్లను పరిశీలించి, చుట్టుపక్కల ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

పంటల ఎదుగుదలకు జాగ్రత్తలు పాటించాలి: ఏవో

నాగల్‌గిద్ద: పత్తి, సోయాబీన్ పంటలు ఎదుగుదలకు రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల ఏవో వెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన నాగల్‌గిద్ద శివారులో సోయాబీన్, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన మందులను కొనుగోలు చేసి పంటలకు పిచికారీ చేయాలన్నారు. దీంతో పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉండదన్నారు. అనంతరం నాగల్‌గిద్దలో పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు.

ఖేడ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉమామహేశ్వర్‌రావు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉమామహేశ్వర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణఖేడ్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వరిస్తున్న కళింగ క్రిష్ణకుమార్‌ను జిన్నారంకు బదిలీ చేశారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కంగ్టి: మండల కేంద్రమైన కంగ్టితో పాటు చాప్టా, తడ్కల్, బాన్సువాడ తదితర గ్రామాల్లో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్యలు పారిశుధ్య పనులు పరిశీలించారు.

ఎస్ఐల బదిలీ

నర్సాపూర్/రామాయంపేట, ఆగస్టు 2: నర్సాపూర్ ఎస్ఐగా పనిచేసిన పుష్పరాజ్ బదిలీపై కామారెడ్డి జిల్లాకు వెళ్లారు. శుక్రవారం ఎస్ఐ పుష్పరాజ్‌ను స్థానిక స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కాగా ఆయన స్థానంలో కామారెడ్డి జిల్లా నుంచి లింగం ఎస్ఐగా నర్సాపూర్‌కు బదిలీపై రానున్నట్లు తెలిసింది. అలాగే రెండున్నరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న రామాయంపేట ఎస్ఐ రంజిత్ కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మరో ఎస్ఐ బాల్‌రెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఉచిత వైద్య శిబిరం

మాసాయిపేట: మెదక్ జిల్లా పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాసాయిపేట బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ జయరాం తెలిపారు. పోస్టాఫీసులో వివిధ పథకాల కింద నమోదు చేయబడిన ఖాతాదారులు పాలసీదారులకు ప్రత్యేకంగా టాటా ఏఐజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరానికి పోస్టాఫీస్ ఖాతాదారులు పాలసీదారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. యశోద ఆసుపత్రి వారిచే నిర్వహించే శిబిరంలో వివిధ జబ్బుల పరీక్షలతో పాటు మందులు అందిస్తారని తెలిపారు.

మిత్ర స్పందన సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం

సంగారెడ్డి అర్బన్: ఆరుద్ర నక్షత్ర దినం సందర్భంగా మిత్ర స్పందన సొసైటీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

'మిషన్ శక్తి'పై అవగాహన

జిన్నారం: జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వందరోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా నల్తూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన నిర్వహించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయడం అభినందనీయం

- నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనిత

నర్సాపూర్, ఆగస్టు 2: విద్యతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనిత తెలిపారు. నర్సాపూర్‌లోని పీఎన్.రెడ్డి హైస్కూల్‌లో 14రోజుల పాటు విద్యార్థులకు మ్యూజిక్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ నిర్వహించిన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, ఎంఈవో బుచ్యా నాయక్, రిటైర్డు హెచ్‌ఎం మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మ్యూజిక్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతో అనిత

సీఎం మీట్‌కు భారీగా తరలిన ఉపాధ్యాయులు

- జెండా ఊపి బస్సులు ప్రారంభించిన డీఈవో

సంగారెడ్డి అర్బన్/జహీరాబాద్/నారాయణఖేడ్, ఆగస్టు 2: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నూతనంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఐదు డివిజన్ల నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం వద్ద డీఈవో వెంకటేశ్వర్లు బస్సులను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 18 బస్సుల్లో 928 మంది బయలుదేరివెళ్లారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి లింబాజి, సీఎంవో వెంకటేశం, ఎంఈవోలు వెంకటనర్సింహులు, భీంసింగ్, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎం కృతజ్ఞతా సభకు జహీరాబాద్ నుంచి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో జూన్, జూలై నెలల్లో పదోన్నతిని పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కృతజ్ఞత సభలో పాల్గొనేందుకు తరలివెళ్లారు.



సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియం వద్ద సీఎం మీటింగ్‌కు తరలివెళ్తున్న ఉపాధ్యాయులు, డీఈవో

తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరం: సూపర్‌వైజర్

కంగ్టి/రేగోడు/పెద్దశంకరంపేట/మెదక్ కల్చరల్, ఆగస్టు 2: తల్లిపాలే పిల్లలకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దెగుల్‌వాడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ విశాల్, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి, ఏఎన్‌ఎం శోభ పాల్గొన్నారు. తల్లిపాలే శ్రేష్టమైనవని వైద్యాధికారి శ్వేత అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను రేగోడు ప్రభుత్వాస్పత్రిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, భూమమ్మ, కళావతి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. పెద్దశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వేదశ్రీ మాట్లాడారు. సూపర్‌వైజర్లు భాగ్యమ్మ, పుష్పల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. మెదక్ మండలం ర్యాలమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సిద్ధమ్మ తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కె.వెంకటయ్య, జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్ మహేష్ రమావత్, సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

రుణమాఫీలో ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

కల్హేర్, జూలై 2: ఉమ్మడి కల్హేర్ మండలంలో రైతులకు రుణమాఫీ ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా సహకరించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు సూచించారు. శుక్రవారం కల్హేర్‌లోని రైతువేదికలో రుణమాఫీలో కొన్ని సాంకేతిక కారణాల ద్వారా మాఫీ జాబితాలో పేరు లేని రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆశ్రయిస్తుండడంతో వారి ఫిర్యాదులను నర్సింహారావు పరిశీలించారు. రుణమాఫీ జాబితాలో పేరు లేకపోవడానికి గల కారణాలను ఓపికతో రైతులకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని సూచించారు. అలాగే కొత్త పట్టా పాసు బుక్కులు పొందిన రైతులు ఆగస్టు 5లోపు రైతుబీమా కోసం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సతీష్, సంతోషకుమారి, రైతులు పాల్గొన్నారు.

'గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి'

హత్నూర, ఆగస్టు 1: కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కల్లుగీత కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం హత్నూర మండలం దేవులపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిలో భాగంగా పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి, మాట్లాడారు. జిల్లాలో ఆగస్టు 2 నుంచి 18 వరకు అమరుల యాదిలో గీతన్నల చైతన్యయాత్ర కొనసాగుతుందన్నారు. శుక్రవారం హత్నూర మండలంలోని దౌల్తాబాద్, మల్కాపూర్, వడ్డేపల్లి, నాగారం, శేర్ఖాన్‌పల్లి గ్రామాల్లో కొనసాగిందని వారు పేర్కొన్నారు. కల్లుగీత కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించి అమరవీరుల యాది సభను నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, సంగారెడ్డి మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, గౌడ జన హక్కుల పోరాట సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాగౌడ్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

- జడ్పీ సీఈవో ఎల్లయ్య

శివ్వంపేట/చిన్నశంకరంపేట, ఆగస్టు 2: అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని కార్యదర్శులను జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆదేశించారు. మండల పరిధిలోని మేజర్ పంచాయతీ దొంతి, పెద్ద గొట్టిముక్ల గ్రామంలోని పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈనెల 5 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతనం, పచ్చదనంలో భాగంగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ తీరు మెరుగుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కార్యదర్శి శంకర్ గౌడ్ ఉన్నారు. గ్రామాల స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో దామోదర్ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడేలో భాగంగా చిన్నశంకరంపేట మండలంలోని సూరారం తదితర గ్రామాలను సందర్శించారు. ఆయన వెంట ఎంపీవో కలీముల్ల, వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: మున్సిపల్ కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 4, 9, 10, 11, 15, 19, 22, 23, 25, 27, 31వ వార్డుల్లో కౌన్సిలర్లు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమాల్లో డీఈ మహేష్, కౌన్సిలర్లు, శానిటేషన్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

- సీఎంను కోరిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 2: నారాయణఖేడ్ నియోజకవర్గంలోని రహదారులతోపాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు భవనాల నిర్మాణం, రహదారులు, అభివృద్ధి పనులు వాటి అవసరాల గురించి వినతిపత్రంలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తామని హామీనిచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ల బాధ్యతల స్వీకరణ

- పటాన్‌చెరువు సబ్ రిజిస్ట్రార్లుగా రవికాంత్, శ్రీనివాస్

కంది, ఆగస్టు 2: రిజిస్ట్రేషన్ శాఖల్లోని జిల్లా రిజిస్ట్రార్లను, సబ్ రిజిస్ట్రార్‌లను బదిలీ చేస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ జ్యోతి బుద్ధప్రకాశ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కంది పరిధిలోని ఉమ్మడి మెదక్ జిల్లా కార్యాలయంలో ఉన్న పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా శేరిలింగంపల్లి నుంచి రవికాంత్, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా శంకర్‌పల్లి నుంచి శ్రీనివాస్‌లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పటాన్‌చెరు జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగిన హనుమంతరావు ఘట్‌కేసర్‌కు, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన షేర్ అలీ వికారాబాద్‌కు బదిలీ అయ్యారు.

'మెదక్ మీదుగా కొత్త రైల్వేలైన్ మంజూరు చేయాలి'

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2: మనోహరాబాద్-మెదక్ పట్టణం మీదుగా నూతన రైల్వేలైన్ మంజూరుచేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 50:50 షేరింగ్ విధానం కింద మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర రైల్వేమంత్రికి లేఖ రాయాల్సిందిగా కోరారు. మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పడ్డప్పటికీ ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా వ్యవస్థతో పాటు రైల్వే సౌకర్యం కల్పిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు

- సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

పుల్‌కల్, ఆగస్టు 2: పత్తి సాగులో రైతులు గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె.సరిత, వైపీ రాజశేఖర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రం చౌటకూర్ శివారులో రైతు జాఫర్‌కు చెందిన పత్తి పంట సాగులో జాతీయ పత్తి పంట పరిశోధన సంస్థ నాగాపూర్ వారి ఆధ్వర్యంలో పత్తి సాగుపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూత దశ నుంచి బుట్టలను అమర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కొల్కూరి మొగులయ్య, ఎండీ.జాఫర్, కలాలి సత్తాగౌడ్, నరేందర్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు: మాజీ సర్పంచులు

నారాయణఖేడ్/జిన్నారం/జహీరాబాద్/పెద్దశంకరంపేట/మనోహరాబాద్, ఆగస్టు 2: పోలీసులు అక్రమ అరెస్టులను అరికట్టాలని సర్పంచుల ఫోరం ఖేడ్ అధ్యక్షుడు జగదీశ్వర్‌చారి అన్నారు. రాష్ట్ర సర్పంచుల ఫోరం పిలుపు మేరకు శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి జగదీశ్వర్‌చారి ఆధ్వర్యంలో వెళ్తున్న మాజీ సర్పంచులు జైపాల్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, ప్రభాకర్ పోలీసులు అరెస్ట్ చేశారు. చలో అసెంబ్లీకి తరలివెళ్తున్న మాజీ సర్పంచులను జిన్నారంలో పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. అరెస్టైన వారిలో మాజీ సర్పంచులు, నాయకులు శివరాజ్, ఖదీర్, ఆంజనేయులు, భార్గవ్, ప్రభాకర్‌రెడ్డి, సింహారెడ్డి, కృష్ణ, శాంతవర్మరెడ్డి, రవి ఉన్నారు. జహీరాబాద్‌లో మాజీ సర్పంచులు హబ్సీరాజు, ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌లను అరెస్ట్ చేశారు. తమ పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న పెద్దశంకరంపేట మండల మాజీ సర్పంచులను ఎస్ఐ శంకర్ శుక్రవారం ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్, ప్రకాష్, సాయమ్మ ఉన్నారు. మనోహరాబాద్‌లో సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్ ముదిరాజ్, మాధవరెడ్డి, పంజా భిక్షపతి, ప్రభావతి నర్సింహులు, పూల అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నశంకరంపేట మండలంలో మాజీ సర్పంచులు యాదగిరి యాదవ్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, సాన సాయిలు, పోచయ్య రమేష్‌ను అరెస్ట్ చేశారు.



జిన్నారం పోలీసుల అదుపులో బీఆర్ఎస్ మాజీ సర్పంచులు, నాయకులు

మాసాన్‌పల్లిలో ఘనంగా ఆషాఢమాసం బోనాలు

కల్హేర్, ఆగస్టు 2: మండల పరిధిలోని మాసన్‌పల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక గ్రామదేవతలకు శుక్రవారం బోనాలు సమర్పించారు. గ్రామంలో ఎన్నడూ లేనివిధంగా మొదటిసారిగా పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల నడుమ బోనాల ఊరేగింపును నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల నుంచి మొదలైన ఊరేగింపు గ్రామ శివారులోని నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ ఆలయాల వరకు కొనసాగింది. గ్రామస్థులు గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ గోపాల్, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు యాదగిరి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మాసాన్‌పల్లి గ్రామంలో గ్రామ దేవతలకు బోనాలను ఊరేగిస్తున్న దృశ్యం

'పల్లెపై పట్టింపేది'పై అధికారుల స్పందన



డీసీసీబీ బ్యాంకు వద్ద సీసీరోడ్డు పనులు

కోహీర్ ఆగస్టు 2: జూలై 24న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'పల్లెపై పట్టింపేది' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. కోహీర్‌లోని పలు కాలనీల్లో నెలకొన్న మురుగు నీటి, రోడ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే కోహీర్‌లోని లాల్‌సాబ్‌వాడి కాలనీలో సీసీరోడ్డుపై ఉన్న మురుగునీటిని తొలగించే పనులు చేపట్టారు. అలాగే డీసీసీబీ బ్యాంకు ఎదుట గల రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేసి సీసీరోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు.

గ్రామాల్లో ఎట్టకేలకు పనులు పూర్తి



బోరు మోటార్ వద్ద పిచ్చిమొక్కలు తొలగించిన దృశ్యం

ఝరాసంగం, ఆగస్టు 2: మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని బర్దీపూర్, గుంతమర్పల్లి గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై జూలై 30న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'గ్రామాల్లో కనిపించని ప్రత్యేకాధికారులు' అంటూ ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బర్దీపూర్ గ్రామంలో అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు, గుంతమర్పల్లిలో తాగునీటి బోరు చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పటాన్‌చెరు, ఆగస్టు 2: నేడు అమీన్‌పూర్ మున్సిపాలిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతులు నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని వెదిరి కాలనీ ఫీడర్ పరిధిలోకి వచ్చే అమీన్‌పూర్, చక్రపురి, సాయిరాజేశ్వరి, డ్రైడ్‌పార్క్, శ్రీవాణినగర్, సబ్వేహోమ్స్, ఎంపైర్‌మీడోస్ కాలనీలకు ఉదయం 10-30 నుంచి 11 గంటల వరకు, ఆర్‌ఆర్.హోమ్స్ ఫీడర్ పరిధిలో కేజీఆర్, సాయివిల్లాస్, గ్రీన్ విల్లాస్, ఎస్ఎస్.హోమ్స్, భరత్‌నగర్ కాలనీల్లో 11 నుంచి 11-30 వరకు, పీఎన్ఆర్ హిల్స్ పరిధిలో వెదిరిటౌన్‌షిప్, విజేత గోడౌన్ వెనక వైపు, అర్బన్‌రైజ్ కాలనీల్లో 11-30 నుంచి 12 గంటల వరకు, బందంకొమ్ము (వేమనకాలనీ) ఫీడర్ పరిధిలోని బందకొమ్ము, నారాయణరెడ్డి కాలనీ, వీరారెడ్డి కాలనీ, ఎన్‌బీఆర్ ఎన్‌క్లేవ్, శివసాయి నగర్, భ్రమరాంబిక ఎన్‌క్లేవ్, ప్రశాంత్‌నగర్‌లో 12 నుంచి 12-30 వరకు, బందంకొమ్ము ఫీడర్ పరిధిలో శ్రీధాంహిల్స్, గ్రీన్‌విల్లాస్, సబ్‌స్టేషన్ వెనక వైపు, కృష్ణబృందావన్ టీచర్స్ కాలనీల్లో 12-30 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ఆయా కాలనీల ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

వివాదాస్పద సర్వే నంబర్లలో పాసుపుస్తకాలు జారీచేయొద్దు

రామచంద్రాపురం, ఆగస్టు 2: రామచంద్రాపురం మండలం పరిధిలోని కొల్లూరు 174, నుంచి 190 ఉన్న వివాదాస్పద సర్వే నంబర్లలో పట్టాదారు పాసు పుస్తకాలు జారీచేయొద్దని లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పై సర్వేనంబర్లలో కొనుగోలు చేసిన ప్లాట్లను కాపాడుకోవడానికి ఉద్యమిస్తామన్నారు. ఇటీవల లోకాయుక్త తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. కొందరు రియల్టర్లు పై సర్వేనెంబర్లలో పట్టాదారు పాసుపుస్తకాలు జారీచేయాలని దరఖాస్తు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

పాల బిల్లులు చెల్లించాలి: రైతులు

రేగోడు, ఆగస్టు 2: పాల బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ పాడి రైతులు రోడ్డెక్కారు. మూడునెలలుగా బిల్లులు రాకపోవడంపై ఆగ్రహించిన రైతులు శుక్రవారం రేగోడు పాల సేకరణ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రేగోడు విజయ పాలశీతలీ కరణ కేంద్రం పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. పాడి పరిశ్రమ ఆధారంగా జీవనం సాగిస్తున్న నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంలో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్ పాల బిల్లులు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఎట్టకేలకు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మరమ్మతు పనులు

మాసాయిపేట, ఆగస్టు 2: మాసాయిపేట మండలం రామంతపూర్‌తండా వద్ద గల రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. బ్రిడ్జిలోకి భారీగా వరదనీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రైల్వే అధికారులు ఎట్టకేలకు స్పందించి పనులు చేపట్టారు. పాదచారులు నడిచేందుకు వీలుగా బ్రిడ్జిని ఆనుకుని ఫుట్‌పాత్ నిర్మిస్తున్నారు. రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద మరమ్మతు పనులు చేపట్టడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.